యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెన మరమ్మతు పనుల్లో జాప్యం

■ లోపలి పేజీలో..

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 2 మే 2025

అపోహలొద్దు

సమన్వయంతో ముందుకు వెళ్లండి

» ఎమ్మెల్యే బొలిశెట్టి, టీడీపీ ఇన్‌చార్జ్ వలవలకు పార్టీల పెద్దలు కర్తవ్యబోధ



చేతులు కలిపిన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి, టీడీపీ ఇన్‌చార్జ్ వలవల తదితరులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జిలు ఇద్దరూ సమన్వయంతో కలిసి ముందుకు వెళ్లాలని ఇరు పార్టీల అగ్ర నాయకులు కర్తవ్యబోధ చేశారు. ఇరువురు నేతలతో చేతులు కలిపించి ఎలాంటి అపోహలు లేకుండా సాగాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంతో ఇరువురు నేతల మధ్య కొన్నాళ్లు నెలకొన్న మనస్పర్థలకు తెరపడినట్లే!

నియోజకవర్గంలో ఇరువురు నేతల మధ్య కొన్నాళ్లుగా అపోహలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.. 'ఉప ఎన్నికల కోసం.. తాను చనిపోవాలని కొందరు కోరుకుంటున్నట్టు' చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. 'ఎమ్మెల్యేగా ప్రజలు నన్ను గెలిపించి తీర్పు ఇచ్చారు. కాని, పాలనలో కొందరి జోక్యం ఉంటోంది. అధికారులను బెదిరిస్తున్నారంటూ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జ్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. మరోవైపు టీడీపీ ఎస్‌సి సెల్‌లోని ఓ కార్యకర్త 'తాడేపల్లిగూడెం మరో పిఠాపురం కాకుండా చూసుకోవాలి' అంటూ తెలుగుదేశం పార్టీ సభలో చేసిన వ్యాఖ్యలు ఎమ్మెల్యే దృష్టికి వెళ్లాయి. ఈ వ్యాఖ్యలు చేసిన వ్యక్తి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో అతనికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.12 లక్షలు మంజూరయ్యేలా బాబ్జి ప్రయత్నించారు. అతనిని తీసుకుని సీఎం చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లారు. బొలిశెట్టి, బాబ్జిల మధ్య అంతరానికి ఇది మరో కారణం.

మరోవైపు కూటమిలో కొందరు నాయకులు ఇరువురి నేతల వద్దకు వెళుతున్నారు. తెలుగుదేశం ఇన్‌చార్జ్ కార్యాలయంలో జరిగిన అంతర్గత సంభాషణలను ఎమ్మెల్యే కార్యాలయానికి చేరవేస్తున్నారు. అలాగే ఎమ్మెల్యే కార్యాలయంలో వ్యక్తిగతంగా చర్చించుకునే విషయాలను తెలుగుదేశం కార్యాలయం వద్ద ప్రస్తావిస్తున్నారు. తమ స్వప్రయోజనాల కోసం ఎక్కడ తాళం అక్కడ వేస్తున్నారు. ఇటువంటి నాయకులతోనూ రెండు పార్టీల మధ్య, ఈ ఇరువురి నేతల మధ్య భేదాభిప్రాయాలు పెరగడానికి కారణమవుతోందంటూ కూటమి శ్రేణుల్లో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బొలిశెట్టి బుధవారం చేసిన వ్యాఖ్యలతో ఇరువురి మధ్య భేదాభిప్రాయాలు వున్నట్టు బహిర్గతమైంది. ఈ విషయాన్ని గ్రహించిన ఇరు పార్టీల అధిష్టానాలు వీరిద్దరిని గురువారం విజయవాడ పిలిపించి మాట్లాడారు.

చేతులు కలిపారిలా..

తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, పార్టీ నాయకులు కె.కె.సత్యనారాయణ, చక్రవర్తిలతో కూడిన సమన్వయ కమిటీ బొలిశెట్టి, బాబ్జిలతో భేటీ అయ్యింది. ఇరువురి వాదనలు విన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి చేసిన వ్యాఖ్యలపై ఇరువురి నుంచి వివరాలు సేకరించారు. నాయకులు ప్రస్తావించిన విషయాల్లో కొన్నింటిని విస్మరించాలని ఇద్దరికి దిశా నిర్దేశం చేశారు. అందుకు వీరు అంగీకరించారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఇద్ద రు కలిసిమెలిసి వెళ్లాలని సూచించారు. కలిసి ముందుకు వెళ్లేందుకు వీరిద్దరూ అంగీకరించడంతో కో-ఆర్డినేషన్ కమిటీ నేతలు సంతృప్తి చెందారు. భేటీలో బొలి శెట్టి, బాబ్జిలతో చేతులు కలిపించారు.

రండి.. కదిలి వెళదాం



ముస్తాబైన ప్రధాని మోదీ పాల్గొనే సభా వేదిక

రాజధాని పునఃనిర్మాణానికి నేడు శంకుస్థాపన

రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభానికి అనువుగా నేడు జరుగుతున్న కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ నుంచి పెద్ద ఎత్తున తరలి వెళుతున్నారు. ఇప్పటికే అధికారులు కలుగజేసుకుని ఏ ప్రాంతం నుంచి ఏ వాహనం, ఏ సమయంలో బయలు దేరుతుందో, తిరిగి, ఏ సమయానికి స్వస్థలాలకు చేరుకుంటామో అనే సమాచారాన్ని ఎక్కడికక్కడ అందించారు. లోపాలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో అధికారులు పూర్తిగా అప్రమత్తమయ్యారు.

- ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు
- భారీ సంఖ్యలో వాహనాలు వేలాదిగా తరలి వెళ్లనున్న ప్రజలు
- అందుబాటులో మంచినీరు, మజ్జిగ.. దారి మధ్యలోనే భోజనాలు
- అధికారుల పర్యవేక్షణ.. పక్కాగా ఏర్పాట్లు

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాజధాని అమరావతి నిర్మాణానికి అనువుగా కోట్ల రూపాయల విలువైన పనులకు నేడు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ మహాఘట్టానికి స్వయంగా హాజరవ్వడానికి వీలుగా ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలి వెళుతున్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా అమరావతి బాట పట్టేందుకే అందరూ ఉత్సాహం చూపిస్తున్నారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథిలు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు, నూజివీడు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున అమరావతికి తరలి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ రెండు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలను అందుబాటులో ఉంచారు. స్థానికులతో పాటు పార్టీల్లో వివిధ హోదాల్లో ఉన్న వారంతా ఉమ్మడి కూడబలుక్కొని శుక్రవారం అమరావతి తరలి వెళ్లేలా సన్నద్ధం అయ్యారు. ఏలూరు, దెందులూరు, చింతలపూడి, ఉంగుటూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, ఉండి, ఆచంట నియోజకవర్గాల నుంచి ఊహించిన దానికంటే అధికంగానే రాజధానికి వెళ్లేందుకు అత్యధికులు ఉత్సాహం ప్రదర్శించారు. దీంతో వాహనాలు సరిపోతాయా లేదా అనే సందేహాలు కొందరు లేవనెత్తారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు తన నియోజకవర్గ నుంచి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దెందులూరులో చింతమనేని ప్రభాకర్ నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వెళ్లనుండటంతో ఆ మేరకు దగ్గరుండీ మరీ ఏర్పాట్లు చేశారు. గన్నవరం వద్ద ఉన్న ఎస్ఎం కన్వెన్షన్ హాలు వద్ద అందరికీ శుక్రవారం భోజన సౌకర్యాలను గురువారం ఆయన దగ్గరుండీ పరిశీలించారు. ఇదిలా ఉండగా వివిధ నియోజకవర్గాల నుంచి తరలి వెళ్లేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లే. అవసరమైతే కొన్ని వాహనాల్లో ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాల్సిందిగా కొందరు సూచనలు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 500 బస్సులను కేటాయించారు, అందులో 250 బస్సులు ఎన్టీఆర్ జిల్లాకు మరో 100 బస్సులు కృష్ణా జిల్లాకు తరలించారు. జిల్లా నుంచి 150 బస్సుల్లో ప్రజలు తరలి వెళ్లేలా అధికారులు ఏర్పాటు చేశారు.



గన్నవరం సమీపాన తన నియోజకవర్గ ప్రజలకు శుక్రవారం అందించే భోజన సౌకర్యాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ప్రతీ వాహనానికి ఓ అధికారి

అమరావతికి వెళ్లే వారి సౌకర్యార్థం ప్రభుత్వం తగు ఆదేశాలు జారీ చేసింది. స్థానికంగా ప్రజలతో బయల్దేరే ప్రతీ వాహనంలోను ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేలా, అవసరమైతే సాయపడేలా ఓ అధికారి అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేకించి ఎలాగో వందల సంఖ్యలో వాహనాలు క్రమపద్ధతితో ముందుకు సాగేలా వాహనంలో ఉండే అధికారికి దిశా నిర్దేశం చేశారు. ఈ అధికారులంతా పరస్పర సమన్వయంతో శుక్రవారమంతా వ్యవహరి స్తారు. ప్రతీ వాహనంలో మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండేలా చూసుకున్నారు. జాతీయ రహదారి పొడవునా వీలైనంత మేర మజ్జిగ, మంచినీరు దూరప్రాంతాల నుంచి వస్తున్న వారికి అందించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా వాహనాలు గమ్యస్థానాలకు చేరుకునేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అమరావతిలో జరిగే బహిరంగ సభాస్థలి, పార్కింగ్ ప్లేస్‌లపై అందరికీ అవగాహన కల్పించేలా గురువారం నాటికే జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా మోదీ సభకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి సుమారు 50వేల మంది హాజరు కానున్నారని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో గురువారం కూటమి ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం దిశ,దశ మార్చే చారిత్రక సభకు హాజరయ్యేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఏలూరు, కృష్ణా జిల్లాల్లో ట్రాఫిక్ ఆంక్షలు 7

ఘనంగా మేడే



జిల్లా వ్యాప్తంగా గురువారం వామపక్షాలు, కార్మిక సంఘాలు , ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎర్ర జెండాలను ఎగురవేసి శ్రామిక, కార్మికుల హక్కుల కోసం సమైక్యంగా పోరాడదామంటూ నినదించారు. ఏలూరులో నిర్వహించిన మేడే ర్యాలీలో (చిత్రంలో) పాల్గొన్న సీఐటీయూ నాయకులు,కార్యకర్తలు.

టెన్త్ టాపర్లకు ప్రతిభా పురస్కారాలు

■ లోపలి పేజీలో..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని 48 మండలాల జడ్పీ హైస్కూళ్లలో ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన ఆరుగురు విద్యార్థులను గురు వారం ఏలూరు జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో జడ్పీ ప్రతిభా పురస్కా రాల తో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో సత్కారం అందుకుంటున్న కామరపుకోట జడ్పీ హైస్కూలు విద్యార్థిని చిలుకుబత్తుల సూర్యదీప్తి (586). చిత్రంలో ఏలూరు డీఈవో వెంకటలక్ష్మమ్మ, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో భీమేశ్వర్, పశ్చిమ డీఈవో నారాయణ తదితరులు.



పంచాయతీ రహదారులకు.. రూ.22.51 కోట్లు

ఏలూరు సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ రహదారులకు మహర్దశ పట్టింది. జిల్లాలో అభివృద్ధికి రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్నాళ్ల నుంచో వేచి చేస్తున్న పంచాయతీ రహదారులకు నిధులు మంజూరు చేశారు. నాబార్డ్ రుణంతో రాష్ట్ర ప్రభుత్వం వాటా కలిపి ఈ నిధులు మంజూ రయ్యాయి. ఏలూరు జిల్లాకు సంబంధించి 14 పంచాయతీ రోడ్లు, ఇతర రహదారుల మరమ్మతులకు రూ.22.51 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.7.55 కోట్లు కాగా మిగిలిన రూ.14.96 కోట్లు నాబార్డ్ అసిస్టెన్స్ (రుణం)గా పేర్కొన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో బీటీ రహదారులను వేయడంతో పాటు కొన్ని రహదారుల మరమ్మతులను చేపట్టనున్నారని పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా దుస్థితిలో ఉన్న పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

8 సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ఆరు నెలల పొడిగింపు

■ లోపలి పేజీలో..

బాలికల భవితకు.. కిశోర వికాసం



» నేటి నుంచి నెలరోజుల అవగాహన కార్యక్రమాలు
» ఆరోగ్య పరిరక్షణ, పోక్సో, ఇతర అంశాల విశదీకరణ



(ఏలూరు-ఆంధ్రజ్యోతి) :

కౌమార దశకు చేరుతున్న బాలికలకు సమాజంలో ఆరోగ్య సమస్యలను, ఇతర ఒడిదడుకులను ఎదుర్కొనడానికి ప్రభుత్వం కిశోర వికాసంతో వేసవిలో వారిని అక్కున చేర్చుకుని అవగాహన కల్పించడానికి నిర్ణయించింది. ఇటీవల బాలిలపై పెరుగుతున్న హింస, ఇతర అకృత్యాలపై రక్షణ కవచంలా నిలవడానికి నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలకు అంగన్‌వాడీ కేంద్రాలు వేదికగా మారున్నాయి. ఈ ఏడాది తొలిసారిగా వేసవి సెలవుల్లో కిశోర వికాసం పేరుతో మే 2 నుంచి జూన్ 10 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టేలా రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే మండలస్థాయి శిక్షణ తరగతులను పూర్తి చేశారు. జిల్లాలో 11 నుంచి 18 ఏళ్లలోపు 25,325 మంది కిశోర బాలికలు మంది ఉన్నారు. వీరికి ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మరక్షణ, బాల్యవివాహాలకు దూరంగా ఉండడం వంటి విషయాలపై అవగాహన కల్పించనున్నారు. వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, డీఆర్‌డీఏ, వీఆర్‌పీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ సిబ్బందితో కూడిన బృందాలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. 2,215 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 10 ప్రాజెక్టుల పరిధిలో బాలికలను 1,619 గ్రూపులుగా ఏర్పాటు చేశారు. ఇందులో 11 నుంచి 14 ఏళ్ల బాలికలు 30,176 మంది, 14 నుంచి 18 ఏళ్లలోపు వారు 25,325 మంది ఉన్నారు.

అవగాహన కార్యక్రమాలిలా...

మే 2న బాలికల సమష్టి పరిచయం, 6న రుతక్రమ పరిశుభ్రత, నిర్వహణ, లైంగిక విద్య, 9న బాల్యవివాహం, పునరుత్పత్తి ఆరోగ్యం, 13న బాలల హక్కులు,రక్షణ, పోక్సోచట్టం, 16న కౌమార దశలో ఐరన్ లోపం, రక్తహీనత, 20న లింగ అసమానత, 23న విద్య, కెరీర్, మార్గదర్శకత్వం, నైపుణ్యాల ప్రాముఖ్యత, 27న సైబర్ మోసాలు, ఆన్‌లైన్ భద్రత, సమస్యలు. 30న ఆర్థిక నిర్వహణ, జూన్ 2న కౌమార బాలికల నాయకత్వం, సాధికారత, 6న శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యం, 19న బాల్య విహహాలతో కలిగే అనర్థాలపై అవగాహన నిర్వహిస్తారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడేనా..?

వేసవి సెలవుల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయి. చిన్న వయస్సులోనే వివాహాలు చేయడంతో అనారోగ్య సమస్యలు, రక్తహీనత, ఇతర రుగ్మతలతో బలహీన సమాజానికి దారులు వేస్తున్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమే అయినా తల్లి దండ్రుల్లో అవగాహన లేకపోవడం వల్ల ఈ తతంగం యథేచ్ఛగా సాగుతోంది. ఒక్కటీ, అరా అడ్డుకోవడం మినహా యంత్రాంగం పూర్తి స్థాయిలో నిఘా ఉంచలేకపోతుంది. ఇటీవల భీమడోలు మండలం లక్ష్మీపురంలో ఓ బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. బాల్య వివాహాలను ఎక్కువగా 12 నుంచి 17 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలకు చేస్తున్నారు. నిర్ణీత వయస్సు లోపు వివాహాలు చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా వారికి పుట్టిన పిల్లలు బలహీనంగా పుడతారని వైద్యులు చెబుతున్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. ఏ ప్రాంతంలో ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నా, ప్రోత్సహిస్తున్నా 1098 టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. 'జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు వివిధ చోట్ల 65 వరకు బాల్య వివాహాలను అడ్డుకున్నాం. సమాజంలో ప్రజలు, చుట్టుపక్కల వారు బాల్య వివాహాలను అడ్డుకోవడంలో తమ వంతు కృషి చేయాలి' అని ఐసీడీఎస్ బాలల సంరక్షణాధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి పేర్కొన్నారు.

బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తాం



బాలికలను అప్ర మత్తం చేయడానికి ప్రభుత్వం అవగాహన కల్పించాలని నిర్ణయిం చడం మంచి పరిణామం. వేసవి సెలవులను వారికి ఉపయోగపడేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారిలో మార్పులకు శ్రీకారం చుడ తాం. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఏదైనా సమస్య తలెత్తినప్పుడు పరిష్కరించుకునేలా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటాం. జిల్లాలో బాల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి సహకారంతో కార్యక్రమాలను మెరుగు చేపడతాం.

- ఐసీడీఎస్ పీడీ పి.శారద

పింఛన్‌దారులకు అండగా ప్రభుత్వం

జిల్లా ప్రత్యేకాధికారి అమ్రపాలి



పెదపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లను పెద్దమొత్తంలో పెంచి పింఛన్‌దారులకు అండగా నిలిచిందని జిల్లా ప్రత్యేకాధికారి అమ్రపాలి పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీని పరిశీ లనకు వచ్చిన ఆమె జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లతో కలసి పెదపాడు మండలం వట్లూరులో లబ్ధిదారులకు గురువారం పింఛన్లను అందజేశారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ పెన్షన్ల కింద 2,59,685 మందికి రూ.112.98 కోట్లను విడుదల చేయగా 2,21,148 (85 శాతం) మందికి పెన్షన్లను అందజేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రభుత్వంలో రూ.35లతో మొదలైన సామాజిక భద్రతా పెన్షన్‌ను నేడు రూ.4 వేల వరకు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం పెన్షన్‌దారులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కూటమి నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై సీహెచ్‌వోల నిరసన

ఏలూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని ఏలూరు జిల్లా ఏపీఎంసీఏ అధ్యక్షుడు సొంగా సిద్దయ్య డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరసన గురువారం నాలుగో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం కింద ఆరేళ్లుగా సీహెచ్‌ఏలు పనిచేస్తున్న జీతంలో ఎలాంటి పురోగతి లేదన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రెండేళ్లుగా జీతభత్యాలపై వినతిపత్రాలు ఇస్తున్నా పరిష్కరించడం లేదని సీహెచ్‌ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి సురేంద్ర, చాందిని, విమల పాల్గొన్నారు. ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, తదితరులు హాజరై ఆందోళనకు మద్దతు తెలిపారు.



ఈవోపీఆర్డీ స్వామికి ఘనంగా సత్కారం

నిడమర్రు, మే1(ఆంధ్రజ్యోతి): ఇంటి, కుళాయి పన్నుల వసూళ్లలో నిడమర్రు మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిపిన ఈవోపీఆర్డీ నారాయణ స్వామిని ఎంపీడీవో విజయకుమారి సత్కరించారు. జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సన్మానించారు. ఏలూరు జిల్లాలో నిడమర్రు మండలం 98 శాతం పన్ను వసూలు చేశారన్నారు. కార్యక్రమంలో ఆఫీసు ఏవో అలివేలు, పంచాయతీ కార్యదర్శులు సంజీవరావు, వెంకట్రావు, విజయ్‌కుమార్, రహీద్ ఉల్లాబేగ్, పెద్దిరాజు పాల్గొన్నారు.

కులగణనను స్వాగతించిన ఎంపీ మహేశ్

ఏలూరు టూటౌన్, మే1(ఆంధ్రజ్యోతి): దేశంలో కులగణనపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తెలిపారు. కులగణలో కేంద్ర మంత్రివర్గం ఆమోదించడం పట్ల ఎన్‌డీపీ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. కులగణను కొన్ని పార్టీలు ఓటుబ్యాంకు రాజకీయాలకు వాడుకోవడం దురదృష్టకరమన్నారు. కులగణ ద్వారా బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా ఎంతో లబ్ధి చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.



గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్రను సన్మానిస్తున్న దృశ్యం

ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్రకు సన్మానం

ఏలూరు టూటౌన్ / దెందులూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : బీసీల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం పని చేస్తోందని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్లా సురేంద్ర అన్నారు. పోతునూరు శివారు కేథవరంలో గవర సంఘం రాష్ట్ర నాయకులు బోడేటి మోహన్ బాబులతో కలిసి సురేంద్ర కేథవరం గ్రామంలో పర్యటించా రు. గౌరీ దేవి ఆలయంలో పూజల అనంతరం సంఘ నాయకులంతా కలిసి సురేంద్రను సన్మానించారు. కార్యక్రమంలో గవర సంఘం నాయకులు కె.హరిబాబు, పిల్లా పైడియ్య, వెంకటరాంబాబు, కె.అప్పారావు పాల్గొన్నారు. ఏలూరులోని అశోక్ నగర్ గవర సామాజిక వర్గ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సురేంద్రకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సుబ్బారావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాక్షులు తాతారావు, సహాయ కార్యదర్శి వేగి గంగాధరరావు, ఆళ్ల సోమినాయుడు, మల్లా శ్రీనివాసరావు, పీ.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ గంగరాజు సేవలు మరువలేనివి

బుట్టాయగూడెం, మే 1(ఆంధ్రజ్యోతి): సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు, పిఆర్ గూడెం మాజీ సర్పంచ్ కుంజా గంగరాజు ఆదివాసీలకు, పార్టీకి చేసిన సేవలు మరువలేనివని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుధాకర్ అన్నారు. గురువారం జరిగిన గంగరాజు సంస్మరణలో సుధాకర్ మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధికి స్వార్థంగా చేసిన సేవల వల్లే పార్టీ కార్యకర్త నుంచి మండల నాయకుడి వరకు ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మల సురేష్, కారం రాఘవ, పి.శ్రీనివాస్, కురసం లత, యు. ఏసుబాబు, జి.ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో ఉపాధి పనులు కల్పించాలి

టి.నర్సాపురం, మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండే పాండురంగ గురువారం డిమాండ్ చేశారు. మండలంలోని బొర్రంపాలెంలో ఉపాధి హామీ పనులు జరిగి దాదాపుగా 8నెలలు కావస్తుందన్నారు. ప్రజలు పనులులేక తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని అడిగి వెంటనే పని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు చొరవచూపి బొర్రంపాలెంలో ఉపాధి పనులు చూపించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఉపాధి కూలీలతో మండల ప్రజాపరిషత్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

టీడీపీ మండల సమన్వయ కమిటీల ఏర్పాటు

ద్వారకాతిరుమల, మే1(ఆంధ్రజ్యోతి): గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో టీడీపీ కమిటీల నియామకం కోసం సమన్వయ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా వాటి వివరాలను ఎమ్మెల్యే విలేకర్లకు వివరించారు.ద్వారకాతిరుమల మండలంలో సమన్వయ కమిటీ సభ్యులుగా మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, పోలిన శ్రీనివాసరావు, డీవీఎస్ చౌదరి, ఎం.బద్రిలను నియమించారు. అలాగే నల్లజర్ల మండలంలో జమ్ముల సతీష్, షేక్ మీర, ఈడే శ్రీను, విక్టర్ బాబు, దేవరపల్లి మండలానికి బళ్ల సూర్యచక్రం, కొయ్యలమూడి చినబాబు, గన్నమని హరికృష్ణ, దంపనబోయిన బ్రహ్మరాజు,గోపాలపురం మండలానికి నున్న మోహన్‌రావు, హరాత రాజా, కొర్లపాటి రాము, గద్దే హరిబాబు, వేముల నాగరాజులను సమన్వయ కమిటీ సభ్యులుగా నియమించామని ఎమ్మెల్యే వివరించారు. వీరు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు జరిపి కమిటీల నియామకం చేపట్టనున్నారు.

భీమడోలులో చలివేంద్రం ప్రారంభం

భీమడోలు, మే1(ఆంధ్రజ్యోతి): భీమడోలు గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, భీమడోలు సీఐ విల్సన్ ముఖ్య అతిథులుగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రిక్షా కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం భీమడోలు గ్రామ దేవతల ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంధ సేవా ప్రతినిధులు,మానస ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో భూముల రీసర్వేను నిలిపివేయండి

పోలవరం మే 1(ఆంధ్రజ్యోతి) :ఏజెన్సీ గ్రామాలైన ఎల్.ఎం.డి.పేట, నాగంపాలెం రెవెన్యూ పరిధిలో అధికారులు నిర్వహించనున్న రీ సర్వేని నిలిపివేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే కలెక్టరుకు వినతిపత్రాలు అందజేసినట్టు తెలిపారు. మండలంలో నాగంపాలెం రెవెన్యూలో అత్యధిక భూములు ఏడబ్ల్యూడీ భూములుగా ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నాయన్నారు. ఆ భూములు గిరిజనులకే చెందుతాయని కోనేరు రంగారావు కమిటీ పేర్కొన్నట్టు తెలిపారు. గతంలో అనర్హులకు ఇచ్చిన దొంగ పట్టాల ప్రాతిపదికన భూ రికార్డులు నమోదు చేయడం సరికాదన్నారు. వివాదాలు పరిష్కరించిన తర్వాతే రీసర్వే చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు ఎస్.కె.బాషా, జిల్లా నాయకులు సవలం రాంబాబు, దాడి రాముడు, కలుం అబ్బులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి, మే 1(ఆంధ్రజ్యోతి) :కుటుంబంలో తలెత్తిన చిన్నపాటి వివాదంతో ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోంది. పెదవేగి మండలం విజయరాయిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ కె.రామకృష్ణ వివరాలు వెల్లడించారు. విజయరాయి గ్రామానికి చెందిన గరికిపాటి సాయిరాం, వెంకట లక్ష్మిలు ఏడాది క్రితం కులాంతర వివాహం చేసుకున్నారని అన్నారు. గత నెల 29న ఇల్లు శుభ్రం చేస్తుండగా ఆమె అత్త వద్దని వెంకటలక్ష్మిని వారించింది. దీంతో వెంకటలక్ష్మి తన తల్లికి ఫోన్‌చేసి, అత్తింట్లో ఎంత పని చేసినా సుఖం లేదంటూ వాపోయింది. అనంతరం 30న ఇంటి నుంచి వెళ్లిపోయింది. అన్ని చోట్ల గాలించినా కనిపించకపోయేసరికి పోలీసులకు సాయిరాం గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి వివాహిత కోసం గిలింపు చర్యలు చేపట్టారు.

ఐటీడీఏ శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి

బుట్టాయగూడెం, మే 1 (ఆంధ్రజ్యోతి): వన్ ధన్ వికాస కేంద్రాల సభ్యులు కె.ఆర్.పురం ఐటీడీఏ ద్వారా ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పీవో కె.రాములు నాయక్ సూచించారు. గురు వారం మంగయ్యపాలెంలో వన్ ధన్ వికాస కేంద్రాల సభ్యులకు అటవీ ఉత్ప త్తులు, పంటలు సేకరణ, మార్కెటింగ్ తదితర అంశాలపై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ రాజబాబు, వెలుగు సిబ్బంది ఉన్నారు.

గో సంరక్షణ జిల్లా అధ్యక్షుడిగా సురేంద్ర



నియామకపత్రం అందుకుంటున్న సురేంద్ర

నిడమర్రు మే 1 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా గోసంరక్షణ సంఘం అధ్యక్షుడిగా నిడమర్రు గ్రామానికి చెందిన షైలవరపు సురేంద్ర కుమార్ ఎంపికయ్యారు. గురువారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో గోసంరక్షణ రాష్ట్ర అధ్యక్షులు అజయ్ వర్మ ఠాకూర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్ర కుమార్ చేత అజయ్‌వర్మ ఠాకూర్ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ నాయకుల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. నియోజకవర్గానికి పది ఎకరాల చొప్పున స్థలం కేటాయించమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. త్వరలో సంఘం కార్యాచరణ చేపడతామన్నారు.

మండుటెండలో ఊరట

- పశువుల కోసం గ్రామాల్లో నీటి తొట్టెలు
- రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పశువుల కాపర్లు



నీరు తాగుతున్న పశువులు

ఏలూరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నీటితొట్టెలతో మూగజీవాల దాహార్తి తీరుతోంది. నీటితొట్టెల నిర్మాణాలతో పశువుల తాగునీటి కష్టాలు తీరడంతో రైతులు, గొర్రెల కాపర్లు, పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు రూరల్ మండలంలో దాదాపు 12 గ్రామాల్లో ప్రభుత్వం నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టింది.ఇందులో నాలుగు పూర్తయ్యాయి. మిగిలినవి కూడా తుది దశలో ఉన్నాయి.మండలంలోని చాటపర్రు, మాదేపల్లి, కాట్లంపూడి, పైడి చింతపాడు, తదితర గ్రామాల్లో అధికారులు వీటిని ఏర్పాటు చేశారు. ఈ తొట్టెలలో గ్రామ పంచాయతీ ద్వారా నీరునింపుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఒక్కో తొట్టెకు 30 వేలు కేటాయింపు..

పశువుల దాహం తీర్చేందుకు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చిస్తోంది. ఒక్కో తొట్టికి దాదాపు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అధికారులు తొట్టెలను నిర్మించారు.వేసవిలో పశువుల దాహం తీర్చాలంటే రైతులు ఇబ్బందులకు గురయ్యేవారు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెరువులు, కుంటల దగ్గరకు వెళ్ళాల్సి వచ్చేది. కొన్ని గ్రామాల్లోని చెరువుల్లో చుక్క నీరు లేదు. దీంతో రైతులు, పశువుల దాహం తీర్చాలంటే ఇబ్బందులు తప్పేవి కావు.. అయితే ప్రభుత్వం పశువులకు నీటి తొట్టెల ఏర్పాటుతో కష్టాలన్నీ తొలిగాయి. దీంతో రైతులు, గొర్రెల కాపర్లు, పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మిక లోకం వర్ధిల్లాలి



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గ్రామగ్రామాన ఘనంగా మేడే వేడుకలు



జెండా ఆవిష్కరించిన హేలాపురి ఎలక్ట్రికల్ వర్కర్స్

(ఆంధ్రజ్యోతి - నెట్‌వర్క్)

ఏలూరులోని హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు మాట్లాడుతూ 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం దృష్ట్యా బోర్డు పథకాలన్నీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బత్తిన శ్రీనివాసరావు, సెక్రటరీ బత్తిన శ్రీనివాసరావు, ఆర్గనైజర్ సెక్రటరీ ఉమా సాయి, ఉపాధ్యక్షుడు నియమాల కృష్ణ, జాయింట్ సెక్రటరీ కాకర్ల సహదేవుడు, పిట్టసాయి, సభ్యులు, పి.జగదీష్, సోమేశ్వరరావు, తోట మోహన్‌రావు, నరసింహరావు, జి.లీలా ప్రసాదరావు, జె.శివకృష్ణ పాల్గొన్నారు. ఏలూరు మార్కెట్ యార్డ్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద, ఏలూరు వన్‌టౌన్ మార్కెట్ సెంటర్‌లోనూ, మెయిన్ బజార్ కన్నయ్య పార్క్ వద్ద, హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, రెడ్డి అప్పలనాయుడు ఆధ్వ ర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు. ఏలూరు టూటౌన్‌లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో మదర్ థెరిస్సా రాష్ట్ర బిల్డింగ్ యూనియన్ వ్యవస్థాపకులు ఎ. మాధవరావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, కాశీకృష్ణ, కందుల సంతోశ్, నమ్మిన లక్ష్మి, సీహెచ్ సాయిబాబా, బీ.కుటుంబరావు, డీ.చినబాబు, తదితరులు పాల్గొన్నారు.ఆశ్రం మెడికల్ కళాశాల అండ్ హాస్పటల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, యూనియన్ అధ్యక్షులు కృష్ణమాచార్యులు, ఎస్.సురేశ్ కుమార్, పాల్గొన్నారు. ద్వారకాతిరుమల యూటీఎఫ్ భవనం వద్ద జరిగిన వేడుకల్లో నేతలు గెడ్డ దేవానంద రావు, కట్టా శ్రీనివాసరావులు, ఎంఈఓ పరసా వెంకట్రావు, కలకొండ చినబాబు, కట్టా భాస్కర్‌రావు, వీర్రాజు, నాగరాజు, బండారు శివాజీ, ఆదికృష్ణ పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలంలోని కామయ్యపాలెం, వంకవారిగూడెం, పి.అంకంపాలెం, పి.నారాయణపురం, కనకాపురం, ములగలంపల్లి, పూచికపాడు గ్రామాల్లో, జీలుగుమిల్లిలో సీఐటీయూ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్, మండలాధ్యక్షులు పసుపులేటి రాము, చిర్రి శ్రీను, చిర్రి రాంపండు, కోలా మధు, పేరాబత్తుల డేవిడ్‌రాజు, సీపీఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, సీఐటీయు కార్యదర్శి సీహెచ్.కొండలరావు, సీహెచ్.సీతారామయ్య, పి.కృష్ణమోహన్ ఉన్నారు. దెందులూరు మండలం ముప్పవరం పంచాయతీ పరిధిలోని సింగగూడెం పరిధిలో ఉన్న నాగహనుమాన్ సాల్వెంట్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో జరిగిన కార్మిక దినోత్సవంలో ఏలూరు జిల్లా సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పాల్గొన్నారు. కార్మికులకు చట్టలపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ టెక్నికల్ డైరెక్టర్ టి.భాస్కర్, జనరల్ మేనేజర్‌లు కె.నాగేశ్వరావు, కె.పురుషోత్తం, రాజేశ్ పాల్గొన్నారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ పల్లి శ్రీనివాసు, జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మామిళ్ళ జయప్రకాష్, చింతలపూడి ఇన్‌చార్జి



కొయ్యలగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కంభం విజయరాజు పాల్గొన్నారు. కుక్కునూరు మండలంలో సీపీఎం, సీఐటీయూ, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో మేడే ర్యాలీ నిర్వహించగా నాయకులు వై.నాగేంద్రరావు, వై.సాయికిరణ్, ఎస్‌కే.గౌస్, సత్యనారాయణ, ఎం.వెంకటాచారి, కొన్నే లక్ష్మయ్య, శ్యామలా, బాబురావు పాల్గొన్నారు. వేలేరుపాడులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎండీ మున్నీర్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో ప్రదర్శన నిర్వహించారు. జంగారెడ్డిగూడెం సీపీఐ కార్యాలయం వద్ద మండల కార్యదర్శి జంపన వెంకట రమణ రాజు, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విఘ్నేష్, ఆర్టీసీ బస్టాండు వద్ద ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు నూలి సత్యనారాయణ తమ తమ జెండాలను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కమిషనర్ కె.వి.రమణ పాల్గొని ప్రసంగించారు. సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, జిల్లా కార్యదర్శి ఏ.రవి ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కొయ్యలగూడెం మండలంలో మేడే వేడుకలను పురస్కరించుకుని రైస్ వర్కర్స్ యూనియన్, బజారు జట్టు వర్కర్స్ యూనియన్, పంచాయతీ వర్కర్స్ యూనియన్, ఆటోవర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. లింగపాలెం మండలం దర్శాజీగూడెం, లింగపాలెంలో భవన నిర్మాణ కార్మిక, హమాలీ, అంగన్‌వాడీ, ఆటో యూనియన్‌లు, కార్మిక సంఘాలు జండాలు ఆవిష్కరించారు. పలు కార్యక్రమాల్లో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, సీఐటీయూ నాయకులు ఎస్.కె.షరీఫ్, మస్తాన్, బిజేఎస్ కుమారి, ఈశ్వరి, మార్త మ్మ, జ్యోతి, దాను, కిషోర్, నాగేశ్, బాబూరావు, జ్యోతి పాల్గొన్నారు. పెదవేగి మండలంలోని పెదవేగి, విజయరాయి, లక్ష్మీపురంలోని మార్కెట్ యార్డు దగ్గర సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించగా నాయకురాలు శ్యామలారాణి, కృష్ణవేణి, అనూరాధ, ఉష, మల్లిక. మౌనిక, పి.ప్రసాద్, దుర్గారావు, బైగాని రమేశ్, ఆంజనేయులు పాల్గొన్నారు. టి.నరసాపురం మండలంలోని శ్రీనివాసపురంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు, బంధంచర్లలో వీరంకి వెంకట్రావులు అరుణపతకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో పాపారావు, సత్యనారాయణ, దేవరపల్లి రంగారావు పాల్గొన్నారు. పెదపాడులోని ప్రజా సంఘాల భవనం వద్ద సీఐటీయూ జిల్లా నాయకులు మావూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. కొత్తూరు, అప్పనవీడు, ఏపూరు తదితర పంచాయతీ కార్యాలయాల వద్ద మేడే నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసడాంగే, జిల్లా నాయకులు పి.కిశోర్‌లు జెండా ఎగురవేశారు.బుట్టాయగూడెం మండలం కె.ఆర్.పురం గిరిజన కార్పొరేషన్ గిడ్డంగి వద్ద ఇఫ్టూ నాయకుడు కె.రాజేశ్, మండల కేంద్రంలో సీఐటీయూ నాయకురాలు వి.ఎస్.కృపామణి, రంగాపురంలో సీపీఐ నాయకురాలు చోడెం దుర్గ జెండాలను ఎగురవేశారు.ఈ కార్యక్రమాల్లో వి.సద్గురు, ఎం.నాగమణి, టి.రామకృష్ణ, మంగతాయారు, పోసమ్మ, దయామణి, శేఖర్, భీమరాజు, టి.మునీశ్వరావు, పి.దుర్గారావు, బి.ముత్యాలమ్మ, చల్లమ్మ, కె.కిషోర్, ఎం.ఏసు పాల్గొన్నారు. ఏలూరులో జరిగిన మేడే వేడుకల్లో సీపీఐ నాయకులు డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమశంకర్, రెడ్డి శ్రీనివాస డాంగే, పళ్ళెం కిషోర్, జగన్నాథరరావు,సీఐటీయూ నాయకులు డీఎన్‌డీవీ ప్రసాద్, బి.సోమయ్య, వీవీఎన్ ప్రసాద్, వైఎస్ కనకారావు, రాంబాబు, రజని, షైమావతి, రవికుమార్ పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో భగత్‌సింగ్ బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడు వేడుకలు నిర్వహించి సీఐటీయూ జెండా ఆవిష్కరించగా సర్పంచ్ దిడ్ల అలకనంద, మాజీ వైస్ ప్రెసిడెంట్ అడపా శ్రీను, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు నేకూరి ఆశీర్వాదం, గురువెల్లి రాజారావు, యూనియన్ అధ్యక్షులు వినోద్ ఎంపీటీసీ బండారు నాగరాజు పాల్గొన్నారు. భీమడోలు మండలం పోలసానపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రహీమా బేగమ్ అసీనా అధ్యక్షతన మేడే వేడుకలు నిర్వహించారు. పంచాయతీ కార్మికులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. భీమడోలు జంక్షన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు సీఐటీయూ జెండాను ఎగురవేశారు. అర్జావారిగూడెం పూళ్ళ, పాతూరు తదితర గ్రామాల్లో మేడే నిర్వహించారు.



వేలేరుపాడులో జెండా ఎగురవేస్తున్న మున్నీర్



బుట్టాయగూడెంలో జెండా ఎగురవేసిన నాయకులు

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల పంపిణీ

- ఇంటికి వెళ్లి అందజేసిన నాయకులు



లింగపాలెంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే



ఏలూరులో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

లింగపాలెం, మే 1(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెంలో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే రోషన్ కుమార్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. అలాగే శుక్రవారం అమరావతిలో జరిగే ప్రధాని మోదీ సభకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కందుల వాణి, మండల విస్తరణాధికారి జె.ఎం.రత్నకుమార్, గరిమెళ్ల చలపతిరావు, మొరంపూడి మల్లికార్జునరావు, తాతిన రాధాకృష్ణ, మొరంపూడి ప్రసాద్, చెన్ను శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, జయరాజు, అజయ్, మహేశ్ పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్ : అర్హతే ప్రామాణికంగా త్వరలో నూతన పింఛన్లు మంజూరు చేయనున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 34వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే మోదీ సభలో పాల్గొని రాజధాని అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్.పెదబాబు, అధికారులు పాల్గొన్నారు. 5వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ డయాలసిస్ బాధితులకు రూ.10 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులకు రూ.4 వేలు పింఛన్లు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పి.రాంబాబు, పి.దాన రాజు, కె.విటల్, ఎం.గంగాధరరావు, కృష్ణ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం :ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేద ప్రజలకు వరమని టీడీపీ సీనియర్ నాయకుడు పరిమి సత్తిపండు అన్నారు. గురువారం 12,13,14 వార్డుల్లో పింఛన్ల కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు, పట్టణ ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరికూటి ధర్మయ్య, పాకనాటి అంజిబాబు, సచివాయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చక్రదేవరపల్లిలో సర్పంచ్, టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సాయిల రాంబాబు, టీడీపీ నాయకులు వైట్ల ఆంజనేయులు, బి.వెంకట రమణ, కార్యదర్శి జి.సత్తిబాబు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జడ్జి రత్నప్రసాద్



ఆశ్రంలోని మానసిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు క్రైం, మే 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యా ప్తంగా ఉన్న మానసిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వాటి స్థితిగతుల సౌకర్యాలు, రోగులకు అం దుతున్న సౌకర్యాలను పరిశీలిస్తున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె రత్న ప్రసాద్ తెలిపారు. ఆశ్రం ఆసుపత్రిలోని మానసిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కార్యదర్శి రత్న ప్రసాద్ సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా నసిక ఆరోగ్య కేంద్రాలపై రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థకు నివేదిక పంపించాల్సి ఉందని, దీనిలో బా గంగానే ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రిలో ఉన్న మానసిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించినట్టు తె లిపారు. ఈ కేంద్రం పరిశుభ్రంగా ఉందని, రోగులకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందిస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రం ఆసుపత్రి సీఈవో హనుమంతరావు, వైద్య అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.



గురునాథరావును సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

వైసీపీ నేత జెట్టి గురునాథరావుకు సన్మానం

జంగారెడ్డిగూడెం, మే 1(ఆంధ్రజ్యోతి) :వైసీపీ మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావును నియమించడం పట్ల వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం గురునాథరావును సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కుక్కల ధర్మరాజు, ఓరుగంటి నాగేంద్ర, చలమల శ్రీనివాస్, తాడేపల్లి ఉమాదేవి, వీరవల్లి సోమేశ్వరరావు, కె.లీలాధర్ రెడ్డి, పి.రాము పాల్గొన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు

పెదపాడు, మే 1(ఆంధ్రజ్యోతి) : సకలకొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేనికి అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

దోమల మందు స్ప్రే

బుట్టాయగూడెం, మే 1(ఆంధ్రజ్యోతి): పులిరాముడుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉప్పరిల్ల, కన్నారప్పాడు, ముంజులూరు కొండరెడ్డి గ్రామాల్లో గురువారం మొదటి విడత దోమల మందు స్ప్రే చేయించారు. మలేరియా జ్వరాలు ఎక్కువగా వస్తున్న గ్రామాల్లో స్ప్రేయింగ్ పనులు జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు, పి.ఆర్.గూడెం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి) : చాటపర్రు నుంచి గుడివాక లంక వరకు, ఆటోనగర్, మాధవపురం లైన్‌లో చెట్ల కొమ్మల తొలగింపును పురస్కరించుకుని శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఉదయం7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గుడివాక లంక, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయ్‌లంక, పైడి చింతపాడు, పెదయాగనమిల్లి, కోమటిలంక, కోటేశ్వర దుర్గాపురం, తిమ్మారావు గూడెం, కొమరడవోలు, తూర్పు లాకులు, సాయినగర్, ఇందిరమ్మ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం, మే 1(ఆంధ్రజ్యోతి) : 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు నిమిత్తం శుక్రవారం కొయ్యలగూడెం మండలం బయ్యన గూడెం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వ్యవ సాయానికి సంబంధించిన త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. అలాగే జంగారెడ్డిగూడెం పట్టణంలో చెట్లు తొలగించే నిమిత్తం పట్టణంలోని రాజుల కాలనీ, సుబ్బారెడ్డి కాలనీ, బైపాస్ రోడ్, కాలేజీ రోడ్, శ్రీనివాసపురం రోడ్, అశ్వారావుపేట రోడ్ ప్రాంతాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

అంబర్ పేట స్టేషన్ పరిధిలో..

భీమడోలు, మే 1(ఆంధ్రజ్యోతి) : అం బర్ పేట సబ్ స్టేషన్ పరిధిలో మొక్కలు తొలగించే పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంబర్ పేట, కండ్రిక, వడ్లపట్ల, అన్నేవారిగూడెం ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

దేవుని మార్గంలో నడవాలి

పెదపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): దేవుని మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు ఆర్‌సీఎం దేవాలయం వద్ద జరుగుతున్న యేసు తిరు హృదయ మహోత్సవాల్లో భాగంగా గురువారం మహా అన్న సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ఆర్‌సీఎం దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అనంతరం విశ్వాసులకు అన్నాన్ని వడ్డించారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ మిల్కియార్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీవారి గోసంరక్షణ శాలలో ఆవులకు చూడి నిర్ధారణ పరీక్షలు

ద్వారకాతిరుమల, మే 1(ఆంధ్రజ్యోతి): గో సంరక్షణకు తరచూ వాటికి వైద్య పరీక్షలు చేయించాలని మండల పశువైద్యాధికారి డా. అంగర సురేశ్ రైతులకు సూచించారు. శ్రీవారి గోశాలలో గురువారం 35 ఆవులకు చూడి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈక్రమంలో గర్భకోశ వ్యాధులున్న ఆవులను గుర్తించి చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోశాల సిబ్బంది పాల్గొన్నారు.

మంగపేటలో ఎక్సైజ్ దాడులు

కొయ్యలగూడెం, మే1(ఆంధ్రజ్యోతి) : మంగపేట గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జీడిమామిడి తోటలో సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను ధ్వంసం చేసి 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ వీరబ్రహ్మం తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. మండలంలోని రాజవరం, అంకాలగూడెం, బోడిగూడెం గ్రామాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన పాతముద్దాయిలను తహసీల్దార్ ఎదుట బైం డోవర్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ వీరబ్రహ్మం తెలిపారు.

గొర్రెలు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు

పెదవేగి, మే 1(ఆంధ్రజ్యోతి) : విజయరాయి గ్రామానికి చెందిన వీరంకి లక్ష్మీనారాయణకు చెందిన 11 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. గతనెల 24న అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరగడంతో బాధితులు అన్ని చోట్ల గాలించారు. వాటి జాడ తెలియక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాటి విలువ రూ.55 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

8 సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ఆరు నెలల పొడిగింపు

ఏలూరు, మే 1(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ పరిధిలో 8 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలు మరో ఆరు నెలలు కొనసాగనున్నారు. పర్సన్ ఇన్‌చార్జి, చైర్ పర్సన్ల(అధికార్ల)ను కొనసాగిస్తూ సహకార శాఖ కమిషనర్ బి.రాజశేఖర్ ఉత్తర్వులను జారీ చేశారు. పర్సన్ ఇన్‌చార్జుల గడువు ఏప్రిల్ నెలాఖరుతో ముగియడంతో మరో ఆరు నెలలు పొడిగిస్తూ జీవో ఇచ్చారు. పేరుపాలెం సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా నరసాపురం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.లక్ష్మిలత, కాళీపట్నం సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా నరసాపురం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.జోసెఫ్ పాల్, తేతలికి తణుకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేవీ రామలక్ష్మి, చెరుకుమిల్లికి అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.సత్యనారాయణ పర్సన్ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారు. ఏలూరు జిల్లాలో గుణ్ణంపల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా ఏలూరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.నర్సింహమూర్తి, సభ్యులుగా వి పవన్ చక్రవర్తి (సీనియర్ ఇన్‌స్పెక్టర్), రమేశ్ (భీమడోలు బీఎం), జీలుగు మిల్లికి సొసైటీ చైర్‌పర్సన్‌గా కైకలూరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్ ప్రసాద రావు, సభ్యులుగా కె.గంగరాజు (సీనియర్ ఇన్‌స్పెక్టర్), ఎస్ శివనాగలక్ష్మి (వేగవరం బీఎం), కామవరపుకోట సొసైటీకి చైర్‌పర్సన్‌గా నూజివీడు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.అజయ్‌కుమార్, సభ్యులుగా ఆర్‌డీ నాగేంద్రబాబు (కెకోట బీఎం), వీటీహెచ్ నారాయణ(కెకోట సూపర్‌వైజర్) వ్యవహరించనున్నారు.

అవ్వకు పింఛను.. మంత్రికి దీవెన

పూలపల్లిలో మంత్రి నిమ్మల పింఛన్ల పంపిణీ


వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న నిమ్మల

పాలకొల్లు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : పూలపల్లిలో గురువారం ఉదయం మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, సచివాలయ సిబ్బందితో కలిసి వృద్ధులకు పింఛన్లు అందజేశారు. దమ్మా అప్పల నరసమ్మ అనే అవ్వ ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తూ అవ్వా బాగున్నావా? అంటూ మంత్రి పలకరించారు. వృద్ధురాలు వచ్చావా నాయనా అనగానే.. నన్ను గుర్తుపట్టావా అని మంత్రి నిమ్మల అడిగారు. బాబా నీవు రామానాయుడువే కదా గుర్తుపట్టాను.. అనగానే స్థానికులు చప్పట్లు కొట్టారు. 97 ఏళ్ల వయసులో కళ్లు నలుపుకుంటూ చూస్తూ, ఆయన మాటను గుర్తుపట్టడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. స్థానికులు మంత్రితో మాట్లాడుతూ మీరు ఈ అవ్వకు బాగా తెలుసని, కరోనా సమయంలో సైకిల్‌పై మా వీధికి వచ్చి అందరితో పాటు అవ్వను పలకరించి బియ్యం, సరుకులు, కూరగాయలు అందించారని, అప్పటి నుంచీ బాగా గుర్తుండిపోయారని చెప్పారు. అవ్వకు పింఛన్ అందించగా నీవు చల్లగా ఉండాలంటూ మంత్రిని అవ్వ దీవించింది. మంత్రి నిమ్మల వెంట ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పాలా శ్రీనివాసు, నాయకులు, తదితరులు ఉన్నారు.

ఎవరైనా సొమ్ములు అడుగుతున్నారా..?

పశ్చిమ ప్రత్యేకాధికారి సూర్యకుమారి ఆరా


పింఛన్ల పంపిణీ పరిశీలిస్తున్న సూర్యకుమారి

భీమవరం టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): చిన అమిరం గ్రామంలో పింఛన్ల పంపిణీలో గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ, జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీ సక్రమంగా జరుగుతుందా, సిబ్బంది డబ్బులు అడుగుతున్నారా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బంది లేదని లబ్ధిదారులు చెప్పడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి కుటుంబ యోగక్షేమాలు, పిల్లల చదువులు గురించి ఆరా తీశారు. పింఛను సొమ్ము దుర్వినియోగం చేయకుండా కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. ఆర్‌ఐ నాగభూషణం, గ్రామ కార్యదర్శి దుర్గాప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ప్రత్యేకాధికారి

చిన్న అమిరంలో అంగన్‌వాడీ సెంటర్‌ను జిల్లా ప్రత్యేకాధికారి ఎ.సూర్య కుమారి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలతో ముచ్చటించి వారి పేర్లను అడిగి తెలుసుకున్నారు. వారితో పాటలు పాడించి సరదాగా గడిపారు. పిల్లలకు విద్యా బోధన పరిశీలించారు. పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల హాజరు పట్టి పరిశీలించి 15 మంది పిల్లలకు 9 మంది ఉండటం గమనించారు. పిల్లలందరినీ అంగన్వాడి కేంద్రానికి పంపేలా తల్లులను ప్రోత్సహించాలన్నారు. పిల్లల బరువు, ఎత్తును స్వయంగా పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలను ఉద్దేశించి మాట్లాడుతు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ సొంత బిడ్డల్లా ఆదరించాలని అన్నారు. చిన్నారులను మంచిగా చూసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి అంగన్వాడి సిబ్బందిని ఆదేశించారు.

ఆక్వా చెరువు తవ్వకాలు నిలిపివేయాలి

కాళ్ళ, మే 1 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో మంచినీటి చెరువుకు ఇబ్బంది కలిగించే చేపల చెరువులు చేపట్టకూడదని పోరాటం చేశామని, ప్రస్తుతం ప్రభుత్వంలో చేపల చెరువులు తవ్వించడానికి ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ఏలూరుపాడు గ్రామప్రజలు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరుపాడు గ్రామంలో మంచినీటి చెరువుకు సమీపంలో తవ్వుతున్న ఆక్వా చెరువును నిలుపుదల చేయాలంటూ గ్రామస్థులు గురువారం ఆందోళన చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి కులమతాలు, పార్టీలకతీతంగా పెద్దలు, యువకులు, మహిళలు పెద్దఎత్తున చేరుకుని చెరువు తవ్వకంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ భూపతిరాజు వెంకటజగ్గరాజు ఇంటి వద్దకు ప్రజలంతా చేరుకుని చెరువు తవ్వకాలు నిలిపివేయాలని కోరారు. అవసరమైతే తమను ఎమ్మెల్యే వద్దకు తీసుకువెళ్లాలని కోరుతూ బైఠాయించారు. చెరువు తవ్వకానికి సిద్ధమవుతున్న రైతుతో సర్పంచ్ ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజులపాటు తవ్వకం పనులు నిలిపివేయాలని వివరించారు.

చిన వెంకన్న కల్యాణానికి పద్మశాలీల పుట్టింటి సారె

ద్వారకాతిరుమల, మే1(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి, ఇంటి ఆడపడుచు పద్మావతి అమ్మవారికి పద్మశాలీల సంఘం నుంచి పుట్టింటి సారె ఇస్తామని ఉమ్మడి జిల్లా సంఘ అధ్యక్షుడు వానపల్లి నాగరాజు తెలిపారు. ఈనెల 7నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11న స్వామివారి తిరుకల్యాణమహోత్సవం రాత్రి 8 గంటలకు జరుగుతుందని, కల్యాణమూర్తులకు తమసంఘం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించాల్సి ఉందన్నారు. పద్మశాలీలు ఎవరైనా ఇవ్వవచ్చని, ముందుగా 96400 68999 నెంబర్‌కు తెలియజేయాలని ఆయన కోరారు.

బాల త్రిపుర సుందరికి 105 గ్రాముల వెండి


వెండిని బహూకరిస్తున్న దాతలు

భీమవరం టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి పీఠానికి గురువారం దాతలు వెండి బహూకరించారు. భీమవరం మండలం గుట్లపాడుకు చెందిన వర్దినీడి నాగేశ్వరరావు 105 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. అమ్మవారి వెండి పీఠానికి దాతలు ముందుకు వచ్చిన విరాళాలు అందిస్తున్నారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

రాజధానికి దారి మారింది

ప్రధాని మోదీ పర్యటనతో కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ట్రాఫిక్ ఆంక్షలు


అమరావతిలో ముస్తాబైన మోదీ సభా వేదిక


ప్రధాని పర్యటన, ట్రాఫిక్ మళ్లింపు వివరాలు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

విజయవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వెలగపూడిలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ రానున్న సందర్భంగా పోలీస్ శాఖ ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ పోలీస్ కమిషనర్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. ప్రధాని రాకను పురస్కరించుకుని నగరంలో వీఐపీలు, వీవీఐపీల తాకిడి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో పలు స్టార్ హోటళ్ల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. వీవీఐపీ, వీఐపీలు, ప్రముఖులు నోవాటెల్ నుంచి మహానాడు జంక్షన్, రమేశ్ హాస్పిటల్ జంక్షన్ బెంజి సర్కిల్ నుంచి ఎంజీరోడ్డు మీదుగా పీసీఆర్ జంక్షన్, ఫ్లైఓవర్ వినాయక టెంపుల్, సీతమ్మవారి పాదాలు అండర్ పాస్, ప్రకాశం బ్యారేజీ మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

భారీ వాహనాలు, లారీల మళ్లింపు

శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు గుంటూరు నుంచి విశాఖపట్నం వైపునకు వెళ్లే భారీ, మధ్యతరహా వాహనాలు బుడంపాడు క్రాస్ నుంచి తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, పెనుమూడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్‌జంక్షన్ మీదుగా వెళ్లాలి.

- విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలు హనుమాన్ జంక్షన్ నుంచి గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, రేపల్లె, బాపట్ల, చీరాల, త్రోవగుంట మీదుగా వెళ్లాలి.
- చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలు త్రోవగుంట నుంచి చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, ప్రామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే భారీ వాహనాలు మేదరమెట్ల నుంచి అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, దామచర్ల, మిర్యాలగూడ, నార్కెట్‌పల్లి మీదుగా వెళ్లాలి.

బస్సులు, కార్ల మళ్లింపు

- ఏలూరు వైపు నుంచి వచ్చే వాహనాలు చిన్న అవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ మీదుగా ముస్తాబాద వెళ్లి అక్కడ సర్వీస్ రోడ్డులోకి దిగి ఎడమ వైపు నున్న బైపాస్‌మీదుగా నున్న జంక్షన్ వరకు వచ్చి ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా కండ్రిక జంక్షన్, పైపుల రోడ్డు, వై.వి.రావు ఎస్టేట్ పాముల కాలువ వద్ద వెస్ట్ బైపాస్ సర్వీస్ మీదుగా నల్లకుంట అండర్ పాస్ బ్రిడ్జి, కృష్ణానది ఐకానిక్ మీదుగా వెలగపూడి సభా ప్రాంగణానికి మళ్లించడం జరిగింది. ఈ మార్గంలో వాహనాలను పార్కింగ్-6లో పార్క్ చేసుకోవాల్సి ఉంటుంది. సభ ముగిసిన తర్వాత కూడా ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.
- ఏలూరు జిల్లా కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి వైపు నుంచి వచ్చే బస్సులు, వాహనాలు బందర్‌రోడ్డుపై బెంజి సర్కిల్ వరకు వచ్చి అక్కడ నుంచి స్క్రూబ్రిడ్జి, వారధి మీదుగా తాడేపల్లి, మంగళగిరి ఎస్‌ఆర్‌ఐ వరకు వెళ్లి ఎరుబాలెం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకుని వాహనాలను పార్కింగ్ -1లో ఉంచాలి.
- ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల నుంచి ఇబ్రహీంపట్నం రింగ్ మీదుగా నల్లకుంట వద్ద ఎడమవైపు తిరిగి పశ్చిమ బైపాస్ సర్వీస్ రోడ్‌లోకి వెళ్లి యూటర్న్ తీసుకుని వెస్ట్ బైపాస్ వంతెన మీదుగా కృష్ణానది ఐకానిక్ ఎక్కి వెలగపూడి సభావేదిక వద్దకు చేరుకోవాలి. వాహనాలను పార్కింగ్-6లో ఉంచాలి.
- ఎన్టీఆర్ జిల్లా అర్బన్ ఏరియా నుంచి వచ్చే వాహనాలు రూటు-3 ప్రకారం బెంజిసర్కిల్, స్క్రూబ్రిడ్జి మీదుగా తేడేపల్లి మంగళగిరి, ఎన్‌ఆర్‌ఐ, ఎరుబాలెం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకుని పార్కింగ్-1లో వాహనాలు పార్క్ చేసుకోవాలి.
- విశాఖపట్నం నుంచి వచ్చే భారీ వాహనాలు పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద కార్యక్రమం ముగిసేంత వరకు నిలిపివేస్తారు. హైదరాబాద్ నుంచి వచ్చే భారీ వాహనాలను ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద కార్యక్రమం ముగిసే వరకు నిలిపివేస్తారు.

వాహనాల దారి మళ్ళింపు

ఏలూరు జిల్లాలో..

ఏలూరు క్రైం: రాజధాని అమరావతిలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో ఏలూరు జిల్లా మీదుగా విజయవాడ వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎస్పీ కేపీఎస్ కిశోర్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు.

- రాజమండ్రి వైపు నుంచి వచ్చే వాహనాలు దేవరపల్లి వద్ద నుంచి గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మీదుగా సత్తుపల్లి, ఖమ్మం వైపు వెళ్లాలని సూచించారు.
- తణుకు, తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలను చేబ్రోలు రైల్వే గేటు వద్ద నుంచి దేవరపల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మీదుగా వెళ్లాలని సూచించారు.
- వాహనాలు ఆ ప్రాంతాలు దాటి ఏలూరు దగ్గరలోకి వస్తే వంగూరు మెయిన్ బైపాస్ బ్రిడ్జి వద్ద నుంచి చింతలపూడి రోడ్డులోకి వెళ్లి చింతలపూడి మీదుగా హైదరాబాద్ వెళ్లాలి.
- చెన్నై వెళ్లే వాహనాలు హనుమాన్ జంక్షన్ నుంచి గుడివాడ మీదుగా వెళ్లాలి.
- ఏలూరు జిల్లాకు సంబంధించిన వారు చెన్నై వెళ్లే భారీ వాహనాలు కైకలూరు, గుడివాడ మీదుగా వెళ్లాలని సూచించారు.
- హైదరాబాద్ వెళ్లే వాహనాలు ఏలూరు నుంచి చింతలపూడి రోడ్డులో వెళ్లాలని లేదా జంగారెడ్డిగూడెం రోడ్డులోనైనా వెళ్లాలి.
- మల్టీయాక్సిల్ గూడ్స్ వాహనాలు జిల్లాలో జాతీయ రహదారిపై ఉన్న విశ్రాంతి ప్రదేశాల్లో నిలుపుదల చేయాలి. వారికి 2వ తేదీ రాత్రి 9 గంటల తరువాతే ముందుకు సాగడానికి అనుమతిస్తారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


సత్కారం పొందిన విద్యార్థులతో జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, డీఈవోలు, జడ్పీ సీఈవో, తదితరులు

- ఉమ్మడి జిల్లాలో పది ప్రతిభావంతులు ఆరుగురికి సత్కారం
- జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు

ఏలూరు అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వ్యవస్థలో బట్టీ విధానం కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విషయ అవగాహన చదువులు, మార్కుల్లో విశ్వసనీయత ఉందని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని జడ్పీ హైస్కూళ్లలో టాపర్లుగా నిలిచిన ఆరుగురు విద్యార్థులను గురువారం జడ్పీ మీటింగ్ హాల్‌లో ప్రతిభా పురస్కారాలతో సన్మానించారు. చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని బట్టి చదివించాలని, ప్రభుత్వ పాఠశాలల నుంచి 14 శాతం మంది విద్యార్థులు 500 మార్కులకు పైబడి సాధించడం సాధారణ విషయం కాదన్నారు. జడ్పీ హైస్కూళ్లలో బోధ నేతర సిబ్బంది నియామకాల కోసం ఆయా శాఖల విభాగాల్లో 270 మంది సర్‌ప్లస్ ఉద్యోగులను గుర్తించామని, త్వరలోనే వీరందరినీ నియమించేం దుకు డిప్యూటీ సీఎం పవన్‌కు విన్నవించగా అంగీకారం తెలిపారన్నారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో భీమేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు, విజయకేతనం స్టడీ మెటీరియల్ కీలకపాత్ర పోషించాయన్నారు. ఫెయిలైన విద్యార్థుల కోసం ఈ నెల 19 వరకు తర్ఫీదునిచ్చి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలు నిర్వహించడం వల్లే ఫలితాలు తగ్గడానికి ఓ కారణమని పేర్కొన్నారు.

'ప్రైవేటు' టీచర్ల వల్లే వెనుకబాటు!

ఏలూరు జిల్లాలో టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత తగ్గడంపై జడ్పీ చైర్‌పర్సన్ భర్త ఘంటా ప్రసాద్ సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాసిన విద్యార్థుల జవాబు పత్రాలను ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయించడం వల్లే ఉత్తీర్ణతా శాతం తగ్గిందన్నారు. మూల్యాంకనంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై ప్రైవేటు టీచర్లు వివక్ష చూపించారని పలువురు ఎంఈవోలు తన దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని డీఈవో వెంకట లక్ష్మమ్మకు, ఇతర అధికారులకు సూచించారు. సోషల్ స్టడీస్ సిలబస్ ఎక్కువగా ఉండడం, విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను పరీక్షలకు కేవలం మూడు నెలలు ముందు మాత్రమే పంపిణీ చేయడం వల్ల విద్యార్థులకు తగినంత సమయం లేకపోవడం ఉత్తీర్ణత తగ్గడానికి కారణాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను ఆగస్టు, సెప్టెంబరులోనే విద్యార్థులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

'ఉమ్మడి జిల్లా' టెన్త్ టాపర్లు వీరే

ఉమ్మడి జిల్లాలోని పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పీఎల్‌ఎస్ జడ్పీ బాలుర హైస్కూలు విద్యార్థిని కొల్లి సాన్వి(590), చినఅమిరం జడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థి ఆముదాలపల్లి శివసాయి వెంకట రామకార్తీక్ (589) ద్వితీయ స్థానం, ఏలూరు జిల్లా టాపర్‌గా కామవరపుకోట జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని చిలుకుబత్తుల సూర్య దీప్తి(586), చింతలపూడి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని కానూరి పూజిత(585) ద్వితీయ స్థానం, పెదపాడు మండలం వీరమ్మకుంట జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని కలిపిండి నీహారిక (584) తృతీయ స్థానాల్లో నిలిచినట్టు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా టాపర్‌గా దేవరపల్లి మండలం యర్నగూడెం ఎస్‌బీఆర్ జడ్పీ హైస్కూలు విద్యార్థిని ఎం.తనుశ్రీ పోల శేషసాయి దుర్గ (582) మొదటి స్థానాల్లో నిలిచారన్నారు.

ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో నారాయణ, తూర్పు గోదావరి జిల్లా డీఈవో తరఫున నల్లజర్ల ఎంఈవో-2 భగవతీదేవి, ఏలూరు డీవైఈవో రవీంద్రభారతి, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు, ఎంఈవోల సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్.నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలైన విత్తనాలు అందించండి

వరి పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో కలెక్టర్


డ్రోన్‌తో పిచికారి చేసే విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

పెనుమంట్ర,మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా రైతులకు మేలైన విత్తనాలను అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మార్టేరు ప్రాంతీయ వరి పరిశోధనా స్థానంలో గోదావరి మండలం పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో గురువారం కలెక్టర్ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరదలు, వర్షాలతో నీళ్ల నిలబడినప్పుడు వరి పంట దెబ్బతింటుందని, తట్టుకునే వరి వంగడాలను అందించాలన్నారు. కలుపు నివారణకు కూడా ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఫంగస్, వైరస్‌ను తట్టుకొని, తడి నేలల్లో ఇబ్బందిలేని రకాలను సూచించాలన్నారు. పరిశోధనా సంచాలకుడు పీవీ.సత్యనారాయణ, విస్తర ణ సంచాలకుడు జి.శివన్నారాయణ, మార్టేరు సహ పరిశోధనా సంచాలకుడు టి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్డు వెంకటేశ్వరరావు కొత్త వరి వంగడాలు, కలుపు నివారణ మందులు వివరాలు, డీకంపోజ్ మందులు, నూతన వరి వంగడాల విస్తరణ, అంతర పంటల సాగు, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పీవీఎస్ గోపాల కృష్ణం రాజు, ఎం.రాంబాబు, సత్యనారాయణరాజు, పెమ్మరాజు తదితర అభ్యుదయ రైతులు వ్యవసాయ సాగులో ఇబ్బందులు, డ్రోన్ల వినియోగం తదితర అంశాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

అనంతరం ఫార్మా రోబోతో పురుగుమందుల పిచికారి, డ్రోన్లు వినియోగంతో మందుల పిచికారీని కలెక్టర్ నాగరాణి స్వయంగా పరిశీలించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సైంటిస్టులు డాక్టర్ గిరిజారాణి, డాక్టర్ రాజమణి, డాక్టర్ చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ మోహన్ రెడ్డి, డాక్టర్ రమణ డాక్టర్ మునిరత్నం, అభ్యుదయ రైతులు, మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం..!


పాలకోడేరు - గొల్లలకోడేరు యనమదుర్రు డ్రెయిన్ బ్రిడ్జిపై వేసిన ఇనుప ఊచల పైనుంచి రాకపోకలు

- యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెన మరమ్మతు పనుల్లో జాప్యం
- రాకపోకలు నిలిపివేసినా ముందుకు సాగని పనులు
- వాహనదారులకు తప్పని తిప్పలు

పాలకోడేరు, మే 1 (ఆంధ్రజ్యోతి): వంతెన మరమ్మతులకు గురైంది. ఎట్టకేలకు రాకపోకలు నిలిపివేసి మరమ్మతు పనులు చేపట్టారు. ఎప్పటిలాగే నిర్లక్ష్యం, అలసత్వం వాహనదారులకు శాపంగా మారింది. అసంపూర్తి పనులతో ఉన్న వంతెనపై ఇనప ఊచల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పాలకోడేరు - గొల్లలకోడేరు మధ్య యనమదుర్రుపై సుమారు 30 ఏళ్ల క్రితం వంతెన నిర్మించారు. భీమవరం నుంచి గొల్లలకోడేరు మీదుగా పాలకోడేరు, తణుకు, నవుడూరు తదితర గ్రామాలకు ఈ బ్రిడ్జే ప్రధాన మార్గం. గోతులు పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారడంతో ఆర్ అండ్ బి అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఏప్రిల్ 10 నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు రాకపోకలు నిలిపివేశారు. పనులు జాప్యం కావడంతో గతంలోనే 'తవ్వేశారు.. వదిలేశారు.. శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనితో మళ్లీ పనులు మొదలుపెట్టారు. ఏప్రిల్ నెలాఖరుకు రాకపోకలు పునరుద్ధరించాలి. ఈ దశలో ఐరన్ ఊచలు కట్టే పనులను రెండు రోజులుగా నిలిపివేశారు. శ్లాబ్ ఎప్పుడు వేస్తారు...? ప్రయాణాలకు ఎప్పుడు మార్గాన్ని సుగమం చేస్తారంటూ ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ తిరిగి రాలేక బ్రిడ్జిపై ఇనుప ఊచల మీద నుంచే ప్రయాణాలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలి.

సెల్‌ఫోన్లు దొంగిలించి..

యూపీఐతో నగదు కొట్టేశారు

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

పాలకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): సెల్ ఫోన్లను దొంగిలించి యూపీఐ ద్వారా నగదు కొల్లగొడుతున్న సైబర్ ముఠా పాలకొండ పోలీసులకు పట్టుబడింది. ముగ్గురు సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 90,200 స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఆకివీడుకు చెందిన యువకులు పట్టుబడ్డాడు. పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు గురువారం వివరాలు తెలిపారు. గత నెల 20న భామినికి చెందిన నారాయణరావు పాలకొండ పట్టణంలోని ఏటీఎం కేంద్రానికి వచ్చాడు. అక్కడ ఆయన సెల్‌ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు దొంగిలించారు. ఫోన్‌లోని యూపీఐ యాప్ ద్వారా రూ.92,700 నగదును మరో ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీనిపై నారాయణరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ అధికారులు నారాయణరావు ఖాతాను ఫ్రీజ్ చేసి లావాదేవీల ఆధారంగా విచారణ చేపట్టి నిందితులను గుర్తించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన మేకల వెంకటేశ్, మహ్మద్ బాషా, గజపతినగరానికి చెందిన పసుపురెడ్డి గోపీచంద్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.90,200 రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. గతంలో వారు ఏటీఎం కార్డులను క్లోన్ చేసి మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు.

అదుపు తప్పిన ఆటో

ఎనిమిది మందికి గాయాలు

ఉంగుటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ఉండి-చేబ్రోలు ఆర్ అండ్ బి రహదారిలో ఉంగుటూరు మండలం సీతారాంపురం-గుణపర్రు పందికోడు మధ్య గురువారం ఆటో తిరగబడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. ఆకివీడుకు చెందిన పలువురు ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. తిరుగు ప్రయాణంలో సీతారాంపురం-గుణపర్రు పందికోడు మురుక్కోడు వంతెన సమీపంలో ఆటో రోడ్డు మార్జిన్ కుంగి పోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఎనిమిది మంది ప్రయాణికులు గాయపడ్డారు.

రహదారి అధ్వానం

సీతారాంపురం-గుణపర్రు మురుక్కోడు వంతెన సమీపంలో ఆర్ అండ్ బి రహదారి గోతులతో ఉండడంతో అక్కడ ప్రయాణించే వారంతా పగటి పూట జాగ్రత్తలు తీసుకుంటారు. ఇక్కడ తరచు వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.

కత్తితో దాడి..

ముగ్గురి అరెస్టు

పెంటపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో ఒక వ్యక్తిని చాకుతో పొడిచిన సంఘటన బుధవారం రాత్రి అలంపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పెనుమాక రాజుకు, అదే గ్రామానికి చెందిన పేకేటి సుమన్‌ల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అలంపురం రజక చెరువుదారిలో వెళుతున్న రాజుతో సుమన్, మరో ఇద్దరు ఘర్షణకు దిగారు. సుమన్ తన వద్ద ఉన్న చాకుతో రాజును పొడిచాడు. గాయపడ్డ రాజును స్థానికులు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు. నిందితుడు సుమన్‌తో పాటు ఇతనికి సహకరించిన బాదంపూడి జయప్రకాష్, గనిసాల మణిరత్నంలను అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

లూర్దుమాత ఉత్సవాలు ప్రారంభం

మండవల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): భైరవపట్నంలో లూర్దుమాత ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులతో భైరవపట్నం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేసి మేరీమాతను కొవ్వొత్తులతో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఫాదర్ శాంతరాజు ఆధ్వర్యంలో జపమాల, దివ్యబలి పూజ నిర్వహించారు. ఏసుప్రభు ఈ లోకాన్ని రక్షించడానికి తన విలువైన రక్తాన్ని దారబోసినట్లు తెలిపారు. అనంతరం బాలబాలికలచే నిర్వహించిన నృత్య ప్రదర్శన, క్రైస్తవ పాటల గాన కచేరీ ఆకట్టుకున్నాయి.

జనార్దనవరంలో ఎక్సైజ్ దాడులు

చాట్రాయి, మే 1(ఆంధ్రజ్యోతి): జనార్దనవరంలో గురువారం జరిపిన దాడిలో పామర్తి వీరయ్యను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పాండు రంగారావు తెలిపారు. ఇతనికి సారా సరఫరా చేస్తున్న పోతనపల్లి పెద్ద తండాకు చెందిన దారావతు శోభనాద్రిపై కూడా కేసు నమో దు చేశామని చెప్పారు. ఈ దాడిలో ఈఎస్‌టీఎఫ్ ఎస్సై అరీఫ్ పాల్గొన్నారు


కోరుకొల్లులో నిర్మించిన రామాలయం

రేపు కోరుకొల్లులో విగ్రహ ప్రతిష్ఠ

కలిదిండి, మే 1 (ఆంధ్రజ్యోతి) కోరుకోల్లు యాదవ పాలెంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో ఈ నెల 3న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, గోపూజ, మూలమంత్ర హోమం, సీతారాముల లక్ష్మణ ఆంజనేయ, శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

వాటర్ ట్యాంక్ వితరణ


వాటర్‌ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట గ్రామ ప్రజల నీటి అవసరాల కోసం యలబాక సత్యనారాయణ, లక్ష్మి జ్ఞాపకార్థంగా కుమారులు నూతన మంచి నీటి సరఫరా ట్యాంక్‌ను తయారు చేయించారు. రూ.లక్ష80 వేలు విలువ గల ఈ వాటర్ ట్యాంక్‌ను గురువారం టీడీపీ గ్రామ అధ్యక్షులు రంగు ఆంజనేయులు, కార్యదర్శి ఉప్పే సత్యనారయణ చేతులు మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ రంగు శ్రీనివాస్, జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు పాశం నాగబాబు పాల్గొన్నారు.


ప్రదర్శన నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

ఉగ్ర దాడులపై నిరసన

కైకలూరు, మే 1(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి హేయమైన చర్యని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు తుపాకుల సోమాచారి అన్నారు. తీవ్రవాదుల దాడులు నిరసిస్తూ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కైకలూరు పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ర్యాలీ చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశాన్ని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంఘ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షునిగా మరోసారి తుపాకుల సోమాచారిని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ లక్కోజు సురేష్, ప్రధాన కార్యదర్శిగా కర్రి మోజేష్, కోశాధికారిగా దివిలి బ్రహ్మంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహణ కార్యదర్శి పూల రామచంద్రరావు, బీఎంఎస్ నాయకుడు జనాల బసవయ్య, బీసీ సంఘం నాయకుడు గంగునేని వరప్రసాద్ పాల్గొన్నారు.

కులగణనను స్వాగతించిన ఎంపీ మహేశ్

ఏలూరు టూటౌన్, మే1(ఆంధ్రజ్యోతి): దేశంలో కులగణనపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తెలిపారు. కులగణలో కేంద్ర మంత్రివర్గం ఆమోదించడం పట్ల ఎన్‌డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. కులగణను కొన్ని పార్టీలు ఓటుబ్యాంకు రాజకీయాలకు వాడుకోవడం దురదృష్టకరమన్నారు. కులగణ ద్వారా బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా ఎంతో లబ్ధి చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.


ముదినేపల్లిలో ముంజికాయలు కోస్తున్న దంపతులు

వేసవిలో చలువనిచ్చే తాటి ముంజలు

ముదినేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): వేసవి వేడి నుంచి తాటి ముంజలు ఉపశమనం కలిగిస్తాయి. బహుళ ప్రయోజనాలున్న ముంజలను తినేందుకు ప్రజలు ఎగబడతారు. పట్టణ ప్రాంతాల వారైతే ముంజల పట్ల మరింత మోజు చూపుతారు. ముదినేపల్లి ప్రాంతంలో ముంజల వ్యాపారం జోరుగా సాగుతోంది. సీజన్ ఆరంభంలో ముంజలు డజను రూ.50 నుంచి రూ.70 వరకు సైజును బట్టి అమ్మకాలు జరగ్గా వేసవి తీవ్రత పెరిగే కొద్దీ ఆ ధర రూ.70 నుంచి రూ.100కు పెరిగింది. బంటుమిల్లి, గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్ మండలాల నుంచి వచ్చి ముంజల దుకాణాలు తెరిచారు. తాటిచెట్ల కాయల నుంచి సహజ సిద్ధంగా లభించే ముంజలు చూడటానికి జెల్లీలా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉంటాయి. వీటిని ఐస్ యాపిల్ అని కూడా పిలుస్తుంటారు. నీటి శాతం ఎక్కువ ఉన్నందున శరీరాన్ని డీ హైడ్రేషన్ నుంచి కాపాడుకోవచ్చు. వేసవిలో శరీరానికి కావాల్సిన ఖనిజాలు, చక్కెరలను ముంజలు సమతుల్యం చేస్తాయి. అధిక మొత్తంలో ఉండే పోటాషియం శరీరంలో ఉండే విష పదార్థాలను తొలగిస్తాయి. వ్యవసాయ పనుల్లేని ఈ సమయంలో ముంజల వ్యాపారం ఎంతో మందికి ఉపాధినిస్తున్నది.






ఆగిరిపల్లిలో జెండా ఆవిష్కరణ.. చాగల్లు, కైకలూరులలో మేడే వేడుకలు..

హక్కుల కోసం సంఘటిత పోరాటం చేయాలి

ఘనంగా కార్మికుల మేడే పండుగ.. కార్మిక జెండాల ఆవిష్కరణలు

కైకలూరు/ఆగిరిపల్లి/ముసునూరు/మండవల్లి/ముదినేపల్లి/కలిదిండి/చాట్రాయి/నూజివీడు, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికులు తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాటం చేయాలని రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం కైకలూరులో పట్టణ శ్రీ శ్యామలాంబ ముఠా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలను నిర్వహిం చారు. ఆటపాక నుంచి కార్మికులంతా ర్యాలీగా కైకలూరు బస్టాండ్ సెంటర్ వరకు వచ్చి ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరించి వేస్తున్నాయని విమర్శించారు. కార్మికులపై పని భారం పెంచడం దారుణమన్నారు. 12 గంటల పని విధానం తీసుకురావాలని కేంద్రప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. కైకలూరు శ్రీ శ్యామలాంబ ముఠా వర్కర్స్‌యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి జాతీయ రహదారి వెంబడి తీన్‌మార్ డప్పు వాయిద్యాల నడుమ మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

- ఆగిరిపల్లి మండల సీపీఎం కార్యదర్శి చాకిరి శివనాగరాజు ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో జెండా ఆవిష్కరణ చేశారు. నెక్కలంగొల్లగూడెం, అంబేడ్కర్ నగర్, సుందరయ్య నగర్ తదితర ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణలు చేశారు.
- ముసునూరు మండలం గుడిపాడులో రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యాదర్శి రాయంకుల లక్ష్మణ రావు ఎర్ర జెండాను ఆవిష్కరించి, కార్మికుల హక్కుల గురించి వివరించారు. ముసునూరు మెయిన్ సెంటర్‌లో న్యూ ఫ్రెండ్స్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకుల్లో సీనియర్ బీజేపీ నాయకులు గుడివాడ వెంకటేశ్వరావు యూనియన్ ప్రెసిడెంట్ పేరిచర్ల నాగరాజుతో కలిసి ఎర్రజెండాను ఆవిష్కరించారు. రమణక్కపేట, చెక్కపల్లి, గోపవరం, చింతలవల్లి తదితర గ్రామాల్లో వివిధ రంగాల కార్మిక సంఘాల నాయకులు, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ నాయకులు మే డే వేడుకలు నిర్వహించారు.
- మండవల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎల్ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ కృషితో కార్మికులకు దేశంలో అనేక చట్టాలు వచ్చాయని అన్నారు.
- ముదినేపల్లిలోని గురజ రోడ్డు సెంటర్‌లో ఆటోవర్కర్స్ యూనియన్, సీఐటియూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, నవ భారత్ ఆటో యూనియన్ ఆధ్వ ర్యంలో మేడే జెండాను ఎగురవేశారు. ఆటో యూని యన్ అధ్యక్షులు బాలు, ఉపాధ్యక్షులు నాయు డు శివకృష్ణ, కార్యదర్శి శ్రీను ఆధ్వర్యంలో మేడే దినోత్సవాన్ని నిర్వహించారు.
- కలిదిండి భాస్కరావుపేట, మూల్లంక, గుర్వాయి పాలెం గ్రామాల్లో సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అరుణ పతాకాలను ఆవిష్కరించారు. కలిదిండి సెంటర్ నుంచి మార్కెట్ యార్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం కార్యదర్శి శేషపు మహంకాళిరావు, సీఐటీయూ నాయకులు అబిదా బేగం, శ్రీకాంత్, రమేష్, బి.పుష్ప, భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ నాయకులు అక్బర్, బాలాజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.
- చాట్రాయి మండలం చిన్నంపేటలో సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ఆధ్వర్యంలో ఉపాధిహామీ పని ప్రదేశంలో మేడే వేడుకలు నిర్వహించి, దాతల సహకారంతో 400 మంది కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. చాట్రాయి సెంటర్‌లో సీపీఐ సీనియర్ నేత రామకృష్ణం రాజు, వైఎస్ విగ్రహం కూడలిలో భవన నిర్మాణ సంఘం నాయకుడు నెల్లూరి మురళీ తదితరులు జెండాలు ఎగుర వేశారు.
- నూజివీడులో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని వెంకటరామారావు సీపీఐ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్లపుల్లారావు, నిమ్మగడ్డ నరసింహా, ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్,నరసింహారావు, బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అక్కినేని రాజా పాల్గొన్నారు. నూజివీడు పట్టణ సీపీఎం అనుబంధ సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే దినోత్సవాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లల్లో అరుణ పతాకాలను ఆవిష్కరించారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఆర్ హనుమాన్లు, జి.రాజు పాల్గొన్నారు.


కార్మిక ర్యాలీలో సంఘీభావం తెలుపుతున్న మంత్రి సారథి

అభివృద్ధిలో శ్రామికులే భాగస్వాములు

నూజివీడు, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు కూటమి పాలనలో సముచిత గౌరవం లభిస్తోందని రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం నూజివీడులో మేడే సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. నూజివీడులో జరిగిన కార్మికుల ర్యాలీలో ఆయన పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. అభివృద్ధిలో శ్రామికులే అసలైన భాగస్వాములు అన్నారు. కార్యక్రమంలో మంత్రితో పాటు తెలుగుదేశం యువనాయకుడు కె.నితిన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి: మంత్రి సారథి

నూజివీడు, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనను నూజివీడు నియోజకవర్గ అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో కలిసి పనిచేసి విజయవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం వర్చువల్ ద్వారా వీరితో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి గ్రామాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయని, వీరికి స్పష్టం చేస్తూ వాటి పర్యవేక్షణ ఏర్పాట్లు, సభకు వచ్చే కార్యకర్తలకు ప్రయాణంలో తాగునీరు, మజ్జిగ, భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. వీటిని సక్రమంగా అమలు జరిగే బాధ్యత నాయకులు, అధికారుల పై ఉందన్నారు. అవసరమైతే గ్రామాల్లో బస్సుల సంఖ్య పెంచుతామన్నారు. మే 2వ తేదీన రూ.49వేల కోట్ల పనులకు అమరావతిలో ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేస్తారన్నారు. కేంద్రప్రభుత్వ సంస్థలైన డీఆర్‌డీవో, డీపీఐఐటీ, రైల్వేకు సంబంధించిన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతాయన్నారు.

ప్రధాని సభకు ఐదు బస్సులు

కలిదిండి, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం నిర్వహించే ప్రధాని నరేంద్ర మోదీ సభకు జనం తరలింపుకు ఐదు బస్సులు ఏర్పాటు చేశామని ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. పెదలంక, కొండంగి, కలిదిండి, కోరుకొల్లు, తాడినాడ గ్రామాల నుంచి శుక్రవారం ఉదయం 9 గంటలకు బయలుదేరనున్నాయి. మొత్తం 250 మందికి ఆహారం, తాగునీరు వసతులు కల్పిస్తున్నామన్నారు.

సభకు వెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తి

ముదినేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం జరుగనున్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు ముదినేపల్లి మండలం నుంచి జనాన్ని తరలించేందుకు ఎన్‌డీఏ నాయకులు, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలం నుంచి ప్రధాని సభకు వెళ్లేందుకు ఆరు బస్సులను ఏర్పాటు చేసి వాటిల్లో వివిధ గ్రామాల నుంచి జనాన్ని తరలించి తిరిగి గ్రామాలకు తీసుకొచ్చే వరకు జాగ్రత్తలు తీసుకునేందుకు మొబలైజేషన్, లైజాన్, అసిస్టెంట్ లైజాన్ ఆఫీసర్లను ఎంపీడీవో వై.రామకృష్ణ నియమించారు. చేవూరు, బొమ్మినంపాడు, పెదగొన్నూరు, చిగురుకోట, చినపాలపర్రు, సంకర్షణపురం గ్రామపంచాయతీ కార్యాలయాల నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లను బస్సుల్లో అందుబాటులో ఉంచుతారు. మండలం నుంచి సుమారు 1500 మందికిపైగా ప్రధాని సభకు తరలివెళ్లనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి తెలిపారు. ప్రధాని సభను జయప్రదం చేసేందుకు కైకలూరు నియోజకవర్గం నుంచి ఎన్‌డీఏ కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ కోరారు.

కూటమి నాయకులు తరలిరావాలి

కైకలూరు,మే1(ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి కైకలూరు నియోజకవర్గం నుంచి కూటమి నేతలు పెద్ద ఎత్తున తరలిరావాలని మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ్‌రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం కైకలూరు నుంచి బస్సులు ఏర్పాటు చేశామని ఈ కార్యక్రమానికి టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివాలని అన్నారు.

ప్రతి ప్రయాణికుడికి పులిహోర, వాటర్, అరటి పండ్లు


చాట్రాయిలో సమావేశమైన నాయకులు, అధికారులు

చాట్రాయి, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరిగే ప్రధాని మోదీ సభకు చాట్రాయి మండలం నుంచి జనాన్ని తరలించటానికి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, టీడీపీ నాయకులు కసరత్తు చేశారు. మండలానికి మొత్తం 20 బస్సులు కేటాయించగా, పెద్ద గ్రామాలకు 2 బస్సులు, చిన్న గ్రామాలకు ఒక బస్సు చొప్పున పంపుతున్నారు. బస్సులో ప్రయాణించే ప్రతి వ్యక్తికి ప్రభుత్వం తరుపున ఒక పులిహోర ప్యాకెట్, రెండు వాటర్ బాటిల్స్, 2 అరటి కాయలు బ్యాగులలో వేసి అందించనున్నారు. ఇవి కాక గ్రామాల టీడీపీ నాయకులు భోజనం ప్యాకెట్లు, తాగునీరు బస్సులలోకి అందించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రధాని సభకు బీజేపీ శ్రేణులు

నూజివీడు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి):అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభ వేడుకలకు హాజరుకానున్న భారతప్రధాని నరేంద్రమోదీకి ఘనస్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు తరలి వెళుతున్నట్లు నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి తెలిపారు.


గంగరాజును సన్మానిస్తున్న తహసీల్దార్ పీవీవీ ప్రసాద్, తదితరులు

సర్వేయర్ గంగరాజుకు ఉద్యోగ విరమణ సన్మానం

ఆగిరిపలి మే 1(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండల సర్వేయర్ మద్దాలి గంగరాజు ఉద్యోగ విరమణ కార్యక్రమం మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత జేసీ శివశ్రీనివాసరావు, తహసీల్దార్ పీవీవీ ప్రసాద్ పాలొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతు గంగరాజు సర్వీస్ గురించి, ఆయన వ్యక్తిత్వం, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

సారా తయారీ స్థావరాలపై దాడులు


ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

ముసునూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సారా స్థావరాలపై నూజివీడు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. చెక్కపల్లిలో సారా కాస్తున్న పామర్తి నాగరాజును అదుపులోకి తీసుకుని, 200లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీ.హెచ్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే బెల్లం ను సప్లై చేసున్న లోపూడికి చెందిన తాటికుండ హరికృష్ణపై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. సీఐ ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	


దేవపూడి పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రం

దేవపూడిలో అపరాల కొనుగోలు కేంద్రం

ముదినేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ మార్క్ ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ముదినేపల్లి మండలం దేవపూడిలో అపరాల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అపరాల పంటకుమద్దతు ధర లభించే విధంగా రైతుల నుంచి మినుము, పెసలు కొనుగోలు చేసేందుకు దేవపూడి పీఏసీఎస్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా పెసలుకు క్వింటాలు ఒక్కింటికి రూ.8682, మినుములకు క్వింటాలుకు రూ.7400 మద్దతు ధర ను చెల్లిస్తారు. ఇందుకు సంబంధించి రైతులు పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలను మార్క్‌ఫెడ్ అధికారులు నిర్దేశించారు. అపరాల్లో మట్టి పదార్థాలు, ఇతర వ్యర్థ పదార్థాలు రెండు శాతం, కల్తీ గింజలు మూడు శాతం, దెబ్బతిన్న గింజలు మూడు శాతం, పాక్షికంగా దెబ్బతిన్న, రంగు మారిన గింజలు నాలుగు శాతం, పరిపక్వము లేని గింజలు మూడు శాతం, పురుగు పట్టిన గింజలు నాలుగు శాతం, తేమ 12 శాతం మించి ఉండకూడదని అధికారులు పేర్కొన్నారు. రైతుల నుంచి మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇస్తామని, రైతు బ్యాంక్ ఖాతాలకు నేరుగా చెల్లింపులు జమ అవుతాయని పేర్కొన్నారు. ఈ కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సీఈవో పళ్లెం శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.

కార్మిక హక్కుల చట్టాలు వినియోగించుకోవాలి

నూజివీడు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): తుక్కులూరు కోరమండల్ పెయింట్స్‌లో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూజివీడు సీనియర్ సివిల్‌జడ్జి షేక్ పెదకాశీం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికహక్కులను కాపాడే చట్టాలను వినియోగించుకుంటూ అభివృద్ధి పథంలో సాగాలన్నారు. బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించరాదన్నారు. ఏఐటీయూసీ నాయకులు నిమ్మగడ్డ నరసింహ పాల్గొన్నారు.

చేపల చెరువు యజమానికి నోటీసు


కోళ్ళ వ్యర్థాలు వేసిన చెరువును పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారులు

కైకలూరు, మే1(ఆంధ్రజ్యోతి): చేపలకు కోళ్ల వ్యర్థాలు ఆహారంగా వేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కైకలూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పి. గణపతి అన్నారు. గురువారం కైకలూరు మండలం చటాకాయ గ్రామంలో కోళ్ల వ్యర్థాలు వేసిన చెరువును బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథకం మేరకు పరిశీలించారు. గ్రామానికి చెందిన ఘంటసాల సుబ్బరాజుకు చెందిన 6.50 ఎకరాల చెరువులో కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తున్నట్లు కనుగొన్నారు. చెరువు యజమానికి జీవోఎంఎస్ నెం.56 గురించి, కోళ్ల వ్యర్థాల వినియోగం వలన నీటి కాలుష్యం, వాయుకాలుష్యం, పర్యావరణ కాలుష్యం, అపరిశుభ్రత, ఈ చేపలు తినడం వలన మనుషులకు అనారోగ్య సమస్యలు వస్తాయని తెలియజేశారు. చెరువు ఆక్వా సాగు అనుమతి పత్రం రద్దు చేస్తూ దీనిని అనధికార సాగుగా నోటీస్ అందజేశారు. తక్షణమే ఆక్వా సాగు నిలిపివేయాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరో పది రోజుల్లో చెరువులో నీటిని పూర్తిగా బయటికి తీసి మూడు నెలల పాటు చెరువును ఎండగట్టాలని సూచించారు.

వారం రోజులు పంట కాల్వలకు నీరు ఇవ్వాలి


కైకలూరులో మంచినీటి చెరువును పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ పొత్తూరి

కైకలూరు,మే1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు పట్టణంలో వేసవిలో మంచినీటి ఎద్దడిని నివారించేందుకు మరో వారం రోజులు కాల్వలకు నీరు ఇవ్వాలని డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు కోరారు. గురువారం కైకలూరు పట్టణంలోని మంచినీటి చెరువును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరు పట్టణానికి 34 ఎకరాల మంచినీటి చెరువులో 20 ఎకరాలు చెరువు నిండినప్పటికీ మరో 14 ఎకరాల మంచినీటి చెరువు నింపవలసి ఉందని అన్నారు. ఇప్పటికే ఈ సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మంచినీటి ఇబ్బందులను గమనించి అధికారులు మరో వారం రోజుల పాటు కైకలూరు తదితర గ్రామాలకు పంటకాల్వలకు నీరు విడుదల చేయాలని లేకుంటే వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని అన్నారు. జలవనరుల శాఖ ఏఈ సురేష్, పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణ్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ


టీడీపీ సభ్యత్వ కార్డులు ధరించి విక్టరీ సింబల్ చూపుతున్న టీడీపీ నాయకులు

చాట్రాయి, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో టీడీపీ దళిత నాయకుడు నక్కా రాము ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వం ఉన్న వారికి రూ.2లక్షలు ప్రమాద బీమా సౌకర్యం కల్పించటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుడిమళ్ళ బ్రహ్మయ్య, జయరాజు, సురేష్, రవి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.